పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ముషీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



- ముషీరాబాద్ ఏఆర్‌వో లక్ష్మీనారాయణ



ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు

కవాడిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని ముషీరా నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌వో), అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 274 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల ఈవీఎంలు, ఇతర సామగ్రిని ఆదివారం కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు ఆయన వివరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏవీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశామన్నారు.

- సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 3 లక్షల 75 వేల 556 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు అని తెలిపారు.
- 274 పోలింగ్ కేంద్రాలను 25 సెక్టార్‌లుగా విభజించి ఒక్కో సెక్టార్‌లో 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వాటి పరిరక్షణకు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు.
- ముఖ్యంగా 66 లొకేషన్లలో 147 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు మైక్రోఅబ్జర్‌వర్లను నియమించామన్నారు.
- దివ్యాంగులు, వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్‌తో పాటు వలంటీర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.
- అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.
- ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో ఎన్నికల కమిషన్ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించిందన్నారు.
- ముషీరాబాద్ నియోజకవర్గంలో ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటి పరిష్కారం కోసం ముగ్గురు ఈఇన్‌స్పెక్టర్ ఎల్ ఇంజినీర్‌లను అందుబాటులో ఉంచడంతోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎంలను అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు.
- ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1465కు గాను ఇప్పటి వరకు సుమారు 1100 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన పేర్కొన్నారు.
- 85 సంవత్సరాలు వయసు దాటిన వారు ఇంటి వద్దే ఓటు వేసేందుకు 25 మంది దరఖాస్తు చేసుకుంటే రెండు టీమ్‌లుగా వెళ్లి మొత్తం 18 మంది వృద్ధులు వారి ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోని ఈ నెల 4వ తేదీన వారితో ఓటు వేయించినట్లు ఆయన పేర్కొన్నారు.
- 274 పోలింగ్ కేంద్రాలకు 44 బస్సుల ద్వారా ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తరలించామన్నారు.
- చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలు పోలీస్ బలగాలతో ఏవీ కళాశాల వద్ద బందోబస్తు నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించారు.

మొత్తం ఓటర్లు 3,75,556	
పురుషులు:	1,54,510
మహిళలు:	1,53,046
ఇతరులు:	12
పోలింగ్ లొకేషన్లు:	105
పోలింగ్ కేంద్రాలు:	274

ఓటు హక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు వీరే...

- ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌లో పోలింగ్ బూత్ నెంబర్ 232లో జేవీ హైస్కూల్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్న హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ చిక్కడపల్లిలోని శాంతినికేతన్ గ్రౌండ్స్‌లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చిక్కడపల్లిలోని లేబర్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

అంబర్‌పేట నియోజకవర్గంలో...



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌వో హేమంత్ కేశవ్ పటేల్, ఏఆర్‌వోలు అపర్ణ, మారుతీదివాకర్

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోకి వచ్చే అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అంతా పూర్తి చేసింది. నారాయణగూడ రెడ్డి కళాశాలలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఏర్పాట్లను ఆర్‌వో హేమాంత్ కేశవ్ పటేల్, ఏఆర్‌వోలు అపర్ణ, మారుతీ దివాకర్‌లు ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

వివరాలివీ...

- మొత్తం ఓటర్లు– 279924
- పురుషులు – 141080
- మహిళలు – 138832
- ఇతరులు – 12
- పోలింగ్ బూతులు – 236
- పోలింగ్ కేంద్రాలు – 103
- వినియోగించే ఈవీఎం యంత్రాలు – 708
- విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బంది – 944
- ప్రతి పోలింగ్ బూత్‌లో ఇద్దరు పోలీసులు
- పోలింగ్ ప్రారంభ సమయం 7:01 గంటలకు
- పోలింగ్ ముగింపు సమయం సాయంత్రం 5:59 గంటలకు



పలు ఆలయాల్లో కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు





నల్లకుంటలోని శంకర్‌మఠంలో ...

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి పలు ఆలయాలను సందర్శించారు. ఆదివారం ఉదయం అంబర్‌పేటలోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నల్లకుంటలోని శారద అమ్మవారిని, సికింద్రాబాద్‌లోని గణేష్ ఆలయం, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేటలోని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బర్కత్‌పురాలో ఓటు వేయనున్న కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి సోమవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పూర దీక్షా మోడల్ హైస్కూల్‌లో 214 పోలింగ్ బూత్‌లో ఓటు వేయనున్నారు.

సీఎం ప్రకటనపై న్యాయవాద సంఘాల హర్షం

కాచిగూడ: తెలంగాణ న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి డి.హర్షవర్ధన్, నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజవర్ధన్ రెడ్డి, సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్, తెలంగాణ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదుల ఆరోగ్య బీమా పథకానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గతంతో పోలిస్తే న్యాయవాదుల సంఖ్య పెరిగిందని అందుకు తగ్గట్లుగా నిధులు కేటాయించాని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సాయుధ బలగాలు



బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ యంత్రాంగం తగిన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా బందోబస్తు నిమిత్తం పోలీసులను రప్పించారు. వెస్ట్‌జోన్ పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 68, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 151 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్ సాయుధ బలగాలను బందోబస్తులో ఉంచారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట గేటు వద్ద ఇద్దరు, పోలింగ్ బూత్ వద్ద ఇద్దరు పహారా కాయనున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 5 వేల మంది పోలీసులు పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు వెళ్లేదారిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు పోలీస్ పెట్రోలింగ్ ముమ్మురం చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే పోలింగ్ బూత్‌లను పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకున్నారు. అనుమానితుల కదలికలపై ఆయా పోలిస్ స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్, బ్లూకోట్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

నాయిని సేవలు చిరస్మరణీయం



నాయినికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



కవాడిగూడ వైశ్రాయి చౌరస్తాలో బీఆర్‌ఎస్ నేతలు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- ఘనంగా నర్సింహారెడ్డి జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతిని ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడి తండాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల కోసం నాయిని నర్సింహారెడ్డి చేసిన కృషి, సేవలు మరువలేనిదన్నారు. ఆయన సేవలను కొనసాగించప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. మాజీ కార్పొరేటర్, వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయిని తనయుడు దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు ఎం.ఎస్.శ్రీనివాస్‌రావు, రాంరెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, సిరిగిరి కిరణ్, రేశం మల్లేష్, నేత శ్రీనివాస్, సరిగిరి శ్యామ్, కళ్యాణ్‌నాయక్, వి.నాగభూషణం, డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

కవాడిగూడ వైశ్రాయి చౌరస్తాలో...

కవాడిగూడ: తెలంగాణ ఉద్యమకారుడిగా, కార్మిక నాయకుడిగా, తెలంగాణ తొలి హోంమంత్రిగా నాయిని నర్సింహారెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని కవాడిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు కాటారం దినేష్ కొనియాడారు. నాయిని జయంతి సందర్భంగా కవాడిగూడ వైశ్రాయి చౌరస్తాలో బీఆర్‌ఎస్ నేతలు నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు రాజు యాదవ్, బల్లేకారి రాములు, పాస్‌పోర్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా



కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాజమౌళిగుప్తా, శ్రీనివాస్‌గుప్తా

కవాడిగూడ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషి చేస్తున్నదని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఐవీఎఫ్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు వారిచే ప్రమాణ స్వీకరాం చేయించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాలలో రాణించేలా ఐవీఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ఐవీఎఫ్ యువజన కమిటీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్య పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక సాయం అందించడంతోపాటు బాలబాలికలకు ఉచితంగా వసతి గృహాలను సైతం ఏర్పాటు చేసిందన్నారు. పుణ్యక్షేత్రాల వద్ద వసతి గృహాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కృషిచేస్తున్నదన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవిందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

తల్లిని మించిన దైవం లేదు



అంగన్‌వాడీ టీచర్స్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్వర్ ముదిరాజ్, తదితరులు

కాచిగూడ: తల్లిని మించిన దైవం లేదని, దేవుడికంటే జన్మనిచ్చిన తల్లి గొప్పదని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మదర్స్‌డే సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలో తల్లులకు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్స్‌గా ఎంతో సేవలందించిన అనిత టీచర్, పద్మావతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రియ, మహేష్, వైష్ణవి, సంయుక్త, అరుణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్క్ కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్

కాచిగూడ: ఇష్టపడి చదివితే విజయాలు వాటంతట అవే వస్తాయని తద్వారా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని ఆర్క్ కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని ఆర్క్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శాలిమార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇష్టపడి చదివినప్పుడే విజయాలు వాటంతట అవే వస్తాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాంప్‌వాక్‌లు, ఫ్యాషన్ షోలు, వెస్టన్ డాన్స్‌లు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ఆధ్యాత్మిక, దేశభక్తి గీతాలు ఆలపించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్ బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా ఆదిశంకరాచార్యుల జయంతి



న్యూ రామాలయంలో శంకరాచార్యులకు హారతులు ఇస్తున్న అర్చక స్వాములు



శంకరమఠంలో శంకరాచార్యులకు పూజలు నిర్వహించిన దృశ్యం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం, న్యూ నల్లకుంటలోని న్యూరామాలయంలో ఆదివారం ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరమఠంలో ముందుగా శక్తి గణపతికి ఆది పూజలు చేసి చంద్రమౌళీశ్వర స్వామి, శారదాంబలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆది శంకరాచార్యులకు అభిషేకము చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు మాట్లాడుతున్న కంటితో అగ్నిని సృష్టించి కన్న తల్లికి ఉత్తర క్రియలు నిర్వహించిన మహా ఋషి ఆది శంకరాచార్యులు అని తెలిపారు.

సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించాలి



శివపార్వతిని సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: సంస్కృతికి ప్రధానమైన సంప్రదాయ సంగీతాన్ని పరిరక్షిస్తు భావితరాలకు అందించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులుపై ఉందని వివిధ రంగాల ప్రముఖులు కోరారు. ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శాస్త్రీయ సంగీత గురువు చిల్ల శివ పార్వతి జన్మదిన సందర్భంగా ఆమె శిష్య బందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళా పోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. శివ పార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీత నేరిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీ రామసాంస్కతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, శేఖర్‌లను అభినయ నాట్య మంజరి బిరుదుతో సత్కరించారు.

సినిమాలు యువతను పెడదారి పట్టించొద్దు

'గాంజా శంకర్' సినిమా పేరు మార్చండి: వేముల రామకృష్ణ

కాచిగూడ: యువతను పెడదోవ పట్టించే విధంగా సాయిధరమ్ తేజ్ నటించిన 'గాంజా శంకర్' సినిమా పేరును వెంటనే మార్చాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గాంజా శంకర్ సినిమా పేరుపై సినిమా నిర్మాత, దర్శకులు పునరాలోచించాలని ఆయన సూచించారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు, యువతపై పెనుప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పేరున్న పెద్ద హీరోలు సినిమాల్లో ధూమపానం, మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, ఈ హీరోలు నేటి యువతకు ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. కమర్షియల్ సినిమాలు తీయడంలో తప్పులేదని, కానీ మన సంస్కృతి, సంప్రదాయాలలను మర్చిపోయి యువతను పెడదోవ పట్టించే విధంగా ఉన్న సినిమాలు చేస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై సెన్సార్ బోర్డు స్పందించి సినిమా దర్శక, నిర్మాతలకు నోటీసులు అందజేయాలని ఆయన కోరారు.

ముస్లిం రిజర్వేషన్ల రద్దు లౌకికవాదానికి విరుద్ధం

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర విధానానికి పూర్తి విరుద్ధమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మన దేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని చెప్పుకున్నప్పటికీ ప్రధానమంత్రి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. అన్ని వర్గాలకు, అన్ని మతాలకు సమానమైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ సాక్షాత్తు దేశ ప్రధాని ఈ విధంగా మత రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణలో ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావని, ముస్లింలలో ఉన్న పలు ఉపకులాలు, ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఇస్తున్నవని పేర్కొన్నారు. సంపద ఉన్న వర్గాలను తొలగించి అర్హత కలిగిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు.

వేలిపై సిరా చుక్క.. కంప్యూటర్ కోర్సులో 80 శాతం రాయితీ పక్కా

కాచిగూడ: ఓటు వేయండి.. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80 శాతం రాయితీతో శిక్షణ పొందండి అంటూ పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ప్రకటించింది. యువతలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఈ రాయితీని ప్రకటించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. 80 శాతానికి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు వేసిన సిరా గుర్తు గల వేలిని చూపిస్తూ సెల్ఫీ దిగి వాట్సాప్ నెంబర్ సెల్: 9505800047 కు పంపిన యువతీ యువకులకు, విద్యార్థులకు కోర్సు ఫీజులో 80 శాతం రాయితీ కూపన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సుల వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పంపడం జరుగుతుందన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణమూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతృ దినోత్సవం సందర్భంగా మన అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైషదం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అబినందనీయమన్నారు. అనంతరం 500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ నలినీ మోహన్, సుబ్బ లక్ష్మి, బుచ్చిరాజు, మస్తాన్ వలీ, టి.వి.సుందర్, రవీంద్రనాథ్, ఆర్.అనురాధ, అన్నపూర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో నగదు, మద్యం పంపిణీ

నాగోలు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పరిధిలో ప్రధాన పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకొనేందుకు బస్తీల్లో ఒక ఓటర్‌కు రూ. 500 నుంచి 1000 వరకు నగదు, మద్యం బాటిల్ చొప్పున అందజేస్తున్నారు. ఆదివారం వివిధ కాలనీల్లో పార్టీ నాయకులు వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులతో కాలనీలోని అపార్ట్‌మెంట్లు, బస్తీల్లో ఉండే ఓటర్లకు డబ్బులు, మద్యం పంపకాలు చేపట్టారు. ఈ విషయం తెలిసి కూడా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా ఉండిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం



సూర్యప్రభ వాహన సేవపై ఊరేగింపు చేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం 28వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అలాగే, శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని నిర్వహించారు. ఆలయంలో శ్రీ లక్ష్మీ నారాయణ కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామికి సూర్యప్రభ వాహన సేవ, అశ్వవాహన సేవ, దీపోత్సవం నిర్వహించారు. పూజల్లో టీటీడీ బోర్డు మెంబర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతా రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయ్యిత అంజయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.